క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఉండండి



రుద్రవరం రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

రుద్రవరం: వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని పథకాలు రైతులకు చేరవేస్తూ వారికి అందుబాటులో ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆయన టెక్నికల్ ఏఓతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రికార్డులను, వీఏఏల పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీకృష్ణ, ఏఈఓ రాజు, వీఏఏలు నాగశ్రీ, శ్రావణి, నాగఫణీంద్రకుమార్ ఉన్నారు.

పండ్ల తోటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : ఉద్యానవన పంటలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రోత్సాహం అందిస్తోందని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో పండ్ల తోటలకు ఎంపికయిన రైతు పొలంలో 110 టెంకాయ మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం సబ్సీడితో 17 రకాల ఉద్యానవన పంటలకు సంబంధించిన మొక్కలను అందజేస్తున్నామన్నారు.

క్షుద్ర పూజల కలకలం



క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం గ్రామ సమీపంలోని పెద్ద రాజ్ చెరు వులో గుర్తు తెలియని దుండగులు క్షుద్ర పూజలు చేయడం గ్రామంలో కలకలం రేపింది. సోమవారం అమావాస్య కావడంతో దుండగులు క్షుద్ర పూజలు చేసి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. మంగళవారం అటు వైపు వెళ్లిన వారు చెరువులో వేసిన ముగ్గు, అందులో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, మట్టి బొమ్మ, ఉప్పు చల్లి ఉండటం గమనించి భయాందోళనకు గురయ్యారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

రుద్రవరం: విత్తన శుద్ధితో పంటలకు తెగుళ్ల బెడద ఉండదని నంద్యాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరళమ్మ అన్నారు. స్థానిక వ్యవసాయ కేంద్రం వద్ద మంగళవారం నంద్యాల ఏరువాక కేంద్రం, జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు రైతులతో సమావేశం నిర్వహించారు. బోరు బావుల కింద వరి నాటే వారు సూడోమోనాస్ కేజీ విత్తనానికి 8 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రసాద్, ప్రభావతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ శ్రీకృష్ణ ఉన్నారు.

ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల సమయంలో రెండవ సబ్జెక్టులో పదోన్నతి తీసుకోవడానికి అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక సారి పదోన్నతి తీసుకుంటే ఒక సంవత్సరం వరకు పదోన్నతి లేదు అనే నిబంధనను సవరించాలని కోరారు. ప్రతి సింగిల్ టీచర్ స్కూల్‌కు ఒక ఎంటీఎస్ టీచర్‌ను ఇవ్వాలని కోరారు. సమావేశంలో భాస్కర రెడ్డి, విజయరావు, జగదీష్, నరసింహులు, శ్రీనివాసులు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణానికి రూ.15 లక్షల మంజూరు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో గతంలో నిర్మించిన డ్రైనేజీ ఇరుకుగా వుండటం, అలాగే చెత్తాచెదారం పేరుకు పోవటంతో మురుగు నీరు రోడ్డుపై నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురతున్నారు. సమస్యను చాగలమర్రిలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి ఏపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్. బాబులాల్, కన్వీనర్ కుమార్‌రెడ్డి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.15 లక్షలు డ్రైనేజీ మరమ్మతులకు, కొత్తగా కల్వర్టు నిర్మించటానికి మంజూరు చేశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ సుదర్శన రావు తెలిపారు.

'సురక్ష'కు హాజరుకాకపోతే షోకాజ్ నోటీసు

చాగలమర్రి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరుకాని ఉద్యోగులందరికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని టాస్క్‌ఫోర్స్ అధికారులు డీడీఓ జనార్దనరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మద్దూరు గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాన్ని తనిఖీ చేశారు. తహసీల్దారు సుభద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి ఉప్పలపాటి స్వర్ణకుమార్ ఉన్నారు.

జగనన్నతోనే పేదల అభివృద్ధి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

- జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం
- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని పేదల అభివృద్ధి సాధ్యమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీ పోచా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదే విధంగా పోలూరు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా కార్యాక్రమాల్లో వారు మాట్లాడుతూ నంద్యాల మండల ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల హామీలను 98శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తూ వచ్చారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు డ్వాక్రా రుణాలు, రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చేయకుండా వారిని మోసం చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కొత్తపల్లెలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాడినరేంద్రారెడ్డి, బాలవెంకటరెడ్డి, బొజ్జా హరినాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, పోలూరు కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రతాప్, ఉప సర్పంచ్ బాలచంద్రారెడ్డి, మునగాల సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్ధం శివరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి 'జగనన్న సురక్ష'

డోర్నిపాడు: జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్న ధ్రువపత్రాలు సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పయిడేల మాధవీలత అధ్యక్షతన నిర్వహించారు. సచివాలయ పరిధిలో 453 ధ్రువపత్రాలను అందజేశారు. అలాగే వైద్య శిబిరం, మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని టాస్క్‌ఫోర్స్ టీం డీఎల్‌డీఓ జనార్దన్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ శివారెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, అమ్మిరెడ్డి నగరం సర్పంచి మాధవి, ఎంపీటీసీ పార్వతి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, డీలర్ శివుడు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో కౌలుకార్డు అందజేస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, అధికారులు



గోవిందపల్లెలో సురక్ష మొబైల్ ఆధార్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

శిరివెళ్ల: జగనన్న సురక్ష ఒక బృహత్ కార్యక్రమమని డీఎల్‌డీ జనార్ధన్‌రావు అన్నారు. మంగళవారం గోవిందపల్లె– 2వ గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరాన్ని తనిఖీ చేశారు. సర్పంచు మరియమ్మ అధ్యక్షతన జరిగిన శిబిరంలో 237 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో జగనన్న సర్క్ష మండల ఇన్‌చార్జీ ఇందూరి ప్రతాపరెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఎంపీటీసీ సుహాసిని, ఉప సర్పంచు ఇందూరి శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి అన్నారు. స్థానిక మూడో గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం సర్పంచు బైరి విజయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 275 మంది లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు.

182 మందికి ధ్రువ పత్రాల పంపిణీ

చాగలమర్రి: మండలంలోని మద్దూరు, బ్రాహ్మణ పల్లె గ్రామాలకు సంబంధించి మద్దూరు గ్రామ సచివాలయం వద్ద తహసీల్దారు సుభద్రమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. సింగల్ విండో అధ్యక్షుడు దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 182 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్లు గ్రామ కార్యదర్శి ఉప్పలపాటి స్వర్ణ కుమార్ తెలిపారు.

గోస్పాడు:జగనన్న సురక్షిత సత్వర ప్రయోజనం చేకూరుతుందని ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ కోటేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని ఎం. కృష్ణాపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 300 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

ఆళ్లగడ్డ : రూరల్ మండలం బాచేపల్లి గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో ఈఓఆర్డీ తహీర్‌హుస్సేన్, ఎంపీటీసీ నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

నవరత్నాలతో ప్రజా సంక్షేమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

గోస్పాడు: నవరత్నాలతో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ బాటలు వేస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి గడప తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం ఏర్పాటు చేసి నాయకులు ప్రజల మధ్యనే ఉండి వారి సమస్యలను తెలుసుకునే అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ప్రహ్లాద రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండల అధ్యక్షుడు రాజు, నాయకులు భాస్కర్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా కేంద్రానికి తగ్గట్టుగా పట్టణాన్ని అందంగా అహ్లాదంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని పార్కులను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 36వ వార్డు రైతు బజార్ సమీపంలో నూతనంగా రూ.32లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్కును మంగళవారం వార్డు కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, బెస్త సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాల అమలు

- ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల

డోర్నిపాడు: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రెండో రోజుమండల చాకరాజువేముల సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా? అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు గుర్తించడానికి చక్కని అవకాశం

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలు గుర్తించటానికి, పరిష్కరించడానికి చక్కని అవకాశాన్ని సీఎం కల్పించారని ఎంపీ, ఎమ్మెల్యే చెప్పారు. రాజకీయ సంప్రదాయాన్ని మార్చి ప్రజలకు సేవ చేయడం, సంక్షేమం అందించడం వంటి విధానాన్ని అవలంబించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకం అందాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదని, ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులు, నాయకులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు అమర్‌నాథ్‌రెడ్డి, గజ్జల రాఘవేంద్రారెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సర్పంచి పద్మిని, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, ఎంపీటీసీ షాజహాన్, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): దుబాయ్‌లో ఆగస్టు మొదటి వారంలో జరిగే ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొనే నంద్యాల పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఇండస్ ఆసుపత్రి వైద్యులు ఆర్థిక సాయం చేశారు. ఎంపీ మాట్లాడుతూ దుబాయ్‌లో ఆగస్టు మొదటి వారంలో జరిగే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు పాల్గొనడం ఎంతో సంతోషదాయకమన్నారు. తనవంతు సాయంగా క్రీడాకారుడు శ్యాంకు రూ.లక్ష నగదును అందజేస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా ఇండస్ వైద్యులు పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారులు పవన్‌కు రూ.50వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎంపీ, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

డోర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సంపూర్ణ అనే వివాహితను అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. గ్రామానికి చెందిన సంపూర్ణ అనే మహిళను ఐదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, రిమ్మనగూడ గ్రామానికి చెందిన రాజేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. రెండేళ్ల సంసారం సాఫీ సాగింది. అనంతరం ఎలాంటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయలేదని, మద్యానికి బానిసై తనను మరో రూ.10లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. భర్త రాజేష్, అత్తమామలు రఘుబాబు, ఉమాదేవిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుజంయుడు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే అరెస్టులు చేయడం తగదన్నారు. భవిష్యత్తులో ఎంపీ, ఎమ్మెల్యే ఇళ్లను ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాసులు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, మనోజ్, అజయ్, విజయ్, హనుమంతు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు తగవు

నంద్యాల(న్యూటౌన్): విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సామరస్యంగా నిర్వహిస్తున్న ఆందోళనలను పోలీసులు నిర్వీర్యం చేయడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫకృద్దీన్‌లు అన్నారు. , విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలంచడం అమానుషమని, వెంటనే విడుదల చేయాలని కోరారు. సురేష్, ప్రతాప్, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, సోమన్న, సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): కడప నగరంలో జరిగే సీపీఐ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రఫీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను భ్రష్టు పట్టించిందన్నారు. కాశాయికరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోహర్, విజయేంద్ర, పవన్, పాల్గొన్నారు.

'పుట్టాలమ్మ'కు రూ. 50 వేలు విరాళం

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాతమతీర్థ పుట్టాలమ్మ క్షేత్రానికి భక్తుడు ఎన్‌ఆర్‌ఐ రామకార్తికేయ రెడ్డి రూ. 50 వేలు విరాళంగా అందజేసినట్లు దేవస్థానం ఈఓ సాయి జయచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. రామకార్తికేయరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అన్నదాన సత్రానికి నగదును అందజేశారని వెల్లడించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, నాణ్యమైన సెల్‌ఫోన్, ఫోర్‌జీ సిమ్ ఇవ్వాలని, ఆన్‌లైన్ వర్క్ శిక్షణ ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, రమణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలన్నారు. సెల్‌ఫోన్ పని చేయకపోతే ఫోన్‌ను కొనుగోలు చేయాలని వేధిస్తున్నారన్నారు. పీహెచ్‌సీకి పిలిపిస్తే టీఏ, డీఏ ఇవ్వాలని, రూ.10లక్షల వరకు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌస్, శివమ్మ, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కాలంలో నంద్యాలకు వెళ్లి..

ఉయ్యాలవాడ మండలం సుద్దమల్ల గ్రామానికి చెందిన వలంటీర్ లక్ష్మీకాంతగౌడ్ ఇంటర్ వరకు చదువుకుని నాలుగు సంవత్సరాల నుంచి వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. ఈయనకు కేటాయించిన 50 ఇళ్లలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేస్తున్నాడు. మహిళల పట్ల మంచి మనసుతో పలకరిస్తూ సేవలందిస్తున్నాడు. కరోనా కష్టకాలంలో గ్రామానికి చెందిన కాల్వ సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో నంద్యాలలోని ఆసుపత్రిలో చేరాడు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వలంటీర్ నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేసి అండగా నిలిచాడు. – ఉయ్యాలవాడ



నంద్యాలలో కాల్వ సుబ్రహ్మణ్యంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీకాంతగౌడ్ (ఫైల్)



కుటుంబ సభ్యుడిలా సేవలు

ప్రభుత్వం నుంచి ప్రతి నెలా వృద్ధాప్య పింఛన్ వస్తోంది. వలంటీర్ లక్ష్మీకాంత గౌడ్ ఇంటి వద్దకు వచ్చి తాత అని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రతి నెలా రూ. 2,750 నగదు అందజేస్తున్నాడు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే నా పరిస్థితిని గమనించి కుటుంబ సభ్యుడిలా కరోనాకాలంలో సైతం అక్కడికి వచ్చి పింఛన్ అందజేశాడు. ప్రభుత్వం అందజేస్తున్న అన్ని పథకాలను మా కుటుంబ సభ్యులకు అందజేస్తూ మా కుటుంబంతో కలిసి పోయాడు. – కాల్వ సుబ్రహ్మణ్యం, సుద్దమల్ల

వైఎస్సార్‌సీపీలోకి వలసలు



వైఎస్సార్‌సీపీలో చేరిన చిత్రేనిపల్లె టీడీపీ నాయకులు

రుద్రవరం: వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపర కొనసాగుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఎర్రగుడిదిన్నెలోని ఎమ్మెల్యే గంగుల నివాసంలో మంగళవారం రుద్రవరం మండలంలోని చిత్రేనిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కంచి పెద్ద నరసింహ్ముడు, లక్ష్మీనరసింహ్ములు(బుజ్జి), ప్రసాదు, జంగం నాగరాజు, చెన్నయ్య, నాగేంద్ర, మేకల పెద్దనరసింహ్ముడు, ఎగ్గోని ప్రతాప్, మోషు, బండి చంద్రలతో పాటు మరో 10 మంది టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి, మండల కన్వీనర్ పాణ్యం నాగేష్, నాయకులు మాధవ, గుండా వెంకటనరసింహ్మయ్య, జయరాముడు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని షాదీఖానా నూతన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీకొట్టాల సమీపంలో ఉన్న ఉర్దూ ఘర్ కం షాదీఖానా నిర్వాహణ దాదాపు మూడు దశాబ్దాలుగా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగుతూ వచ్చింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పట్టుబట్టి వైఎస్సార్‌సీపీ నాయకులతో నూతన కమిటీని ఎంపిక చేయించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆదేశాలు ఇచ్చారు. ఆర్డర్ కాపీ అందుకున్న నూతన కమిటీ సభ్యులు, ముస్లిం నాయకులు సిమెంటు నజీర్, రసూల్, బీరువాల బాషా, రహిమాన్, దస్తగిరి, గౌబోలి, అల్లి వుశేన్ తదితరులు ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో గంగమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి అనంతరం అమ్మవారిని పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. వేకువజామునే భక్తులు చీర, పసుపు, కుంకుమ, బోనాలు, నవధాన్యాలతో నైవేద్యంతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించారు. 50 సంవత్సరాల అనంతరం గ్రామంలో గంగ జాతర నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో గ్రామంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



గంగ జాతరలో భక్తులకు అభివాదం చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల

డోర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన రజకులు మంగళవారం వర్షం కోసం గంగమ్మకు బోనాలు సమర్పించారు. ప్రతి ఏటా ఆనవాయితీ ప్రకారం వర్షం కోసం బోనాలను సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో 'ఎగ్'నామం!

చాగలమర్రి: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కోడి గుడ్ల పంపిణీలో మండలంలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు చేతివాటం ప్రదర్శించారు. ఈ విషయంపై అంగన్‌వాడీ కార్యకర్తల మధ్య విభేదాలు రావడంతో విషయం బయటకు పొక్కింది. మండలంలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ కేంద్రం ఉన్నాయి. వీటికి సంబంధించి గర్భిణులు, బాలింతలు 942 మంది ఉండగా, ఆరేళ్ల లోపు చిన్నారులు 3,565 మంది ఉన్నారు. వీరికి 1,25,000 గుడ్లు ప్రతి నెలా పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ గుడ్లను నెలలో మూడు విడతలుగా ఒక్కో విడతకు 41,600 గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. అయితే గత నెలలో మూడో విడత 41,600 గుడ్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి సూపర్ వైజర్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు కొంతమంది గుడ్లకు బదులుగా అంగన్‌వాడీ కార్యకర్తల బ్యాంకు ఖాతాలలోకి డబ్బులను జమ చేయించుకున్నారు. ఈ విషయంపై వారి మధ్య లొల్లితో బయటకు పొక్కింది. దీంతో నగదును తిరిగి కాంట్రాక్టర్ ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేశారు.



గుడ్ల పంపిణీపై ఇళ్ల వద్దకు వెళ్లి విచారిస్తున్న సీడీపీఓ తేజేశ్వరి

సీడీపీఓ విచారణ

ఈ విషయంపై ఆళ్లగడ్డ సీడీపీఓ తేజేశ్వరికి ఫిర్యాదు అందడంతో చాగలమర్రిలోని 4, 16 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆమె రెండు రోజులుగా విచారిస్తున్నారు. ఆమె మాట్లాడుతూ.. గుడ్లకు బదులు నగదును అంగన్‌వాడీ కార్యకర్తలు కాంట్రాక్టర్ నుంచి ఖాతాల్లో జమా చేయించుకున్న మాట వాస్తవమేనని, అయితే ఆ నగదు మొత్తాన్ని వెనక్కి పంపివేశారని తెలిపారు. కాంట్రాక్టర్‌తో మళ్లీ మూడవ విడత గుడ్లను దిగుమతి చేసుకొని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసినట్లు కార్యకర్తలు తెలిపారన్నారు. గుడ్లు పంపిణీ చేశారా? లేదా? అనే విషయంపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

15న చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 20వ తేదీన ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల రోటరీ క్లబ్ సహకారంతో చెరువు కట్ట వద్ద ఉన్న రోటరీ క్లబ్ భవనంలో 15 సంవత్సరాల్లోపు ఓపెన్ బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమలలో నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శుల దండె దస్తగిరి, సురేంద్రలు పాల్గొన్నారు. విజేతలకు పథకాలు, ట్రోఫీలు రోటరీ క్లబ్ సభ్యులు కామిని బాలకృష్ణ అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 9010451585కు సంప్రదించాలన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకొని రావాలని నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులు విజశేఖర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రఘుప్రకాష్ కోరారు. అవనిగడ్డలో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. దాడిని ఖండిస్తూ దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



మహిళకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పేదింటి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు శిల్పా మహిళా సహకార్ బ్యాంకు చైర్‌పర్సన్ శిల్పానాగినిరెడ్డి తెలిపారు. బ్యాంకు ద్వారా రుణాలు పొందిన పేదింటి మహిళలు ఆర్థికంగా వృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. స్థానిక టెక్కె మార్కెట్ యార్డులోని శిల్పామహిళా సహకార్ బ్యాంకు కార్యాలయ ఆవరణలో మంగళవారం 220 మంది మహిళలకు రూ.31.43లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలా, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

శిరివెళ్ల: వెంకటాపురంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శనగ రమణారెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకొని నాయకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు.